నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 26 నవంబర్ 2024 | MEDAK

బాధిత కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ

యశోద దవాఖానలో వజీర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

రెండో వార్డ్ కౌన్సిలర్ చంద్రాన్ని ఓదార్చుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట/చిన్నకోడూరు నవంబర్ 25: సిద్దిపేట నియోజకవర్గంలోని పలువురు కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న 30వ వార్డు కౌన్సిలర్ ఫాతిమా బేగం భర్త, పార్టీ సీనియర్ నాయకుడు వజీర్‌ను హరీశ్‌రావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని వజీర్ కుటుంబానికి భరోసానిచ్చారు.

అంత్యక్రియల్లో...

సిద్దిపేట నియోజకవర్గంలోని పలువురు మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ కూర రవీందర్ రెడ్డి మరణించగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవీందర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సిద్దిపేట పట్టణంలోని రెండో వార్డు కౌన్సిలర్ చంద్రం తల్లి మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ చంద్రాన్ని ఓదార్చారు. సిద్దిపేట అంబేద్కర్ నగర్‌కు చెందిన ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు సాకి గాంధీ తండ్రి ఆశయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీని ఓదార్చి ధైర్యం చెప్పారు. చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామ రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఆశయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

రవీందర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఐఐటీహెచ్‌లో నికాన్ సెంటర్ ప్రారంభం

సంగారెడ్డి జిల్లా కందిలోని నికాన్ సెంటర్ ఒప్పంద పత్రాలతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి, నికాన్ ఇండియా సభ్యులు

కంది, నవంబర్ 25: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం నికాన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ప్రారంభించారు. దేశంలోనే మొదటి నికాన్ సెంటర్‌ను ఐఐటీహెచ్‌లో ప్రారంభించడం విశేషం. ఆధునిక సూక్ష్మచిత్రణ సాంకేతికతలతో పరిశోధకులకు సాధికారత కల్పించాలన్న ఉద్దేశంతో ఈ సెంటర్ ప్రారంభించారు. నికాన్ తాజా చిత్రీకరణ సాంకేతికత విద్యార్థుల పరిశోధనలకు అద్భుతమైన పరికరాలను అందించనుంది. ఇది ఒక వినోద కేంద్రంగా, పరిశోధకులకు జీవ సంస్కృతులను వివిధ పరిణామాల్లో అన్వేషించడానికి శక్తిని అందిస్తుంది. ఒకే సెల్ నుంచి అధిక నిర్ధారిత చిత్రీకరణలో విజ్ఞానాలను సులభతరం చేస్తుంది. ఈ సందర్భంగా నికాన్ ఇండియా ఎండీ సజ్జన్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో విస్తృత శాస్త్ర సృష్టికి అత్యాధునిక సూక్ష్మచిత్రణ వ్యవస్థను పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. శాస్త్ర పరిశోధనను ముందుకు తీసుకెళ్లడం మాత్రమే కాకుండా వివిధ శాస్త్ర విభాగాల్లో పరిశోధకులు, విద్యార్థుల సృజనాత్మకతను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్‌మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్‌లో నికాన్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ అన్వేషణాత్మక పరిశోధన, వివిధ అభ్యాస అవకాశాలను ప్రోత్సహించేందుకు దోహదపడుతుందన్నారు. అకాడమిక్, పరిశోధన విభాగాల్లో ఈ కేంద్రం పరిశోధకులు, విద్యార్థులకు సాధ్యమైన సరిహద్దులను సవాల్ చేసే వీలుతో పాటు భవిష్యత్తు శాస్త్రవేత్తల బలమైన సమాజాన్ని నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో నికాన్ ఇండియా సభ్యులు ఎకీ వాకామియా, కాజుటాక వాతమహే, డెబ్ శేఖర్, మహావీర తన్‌వార్, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సర్కార్ వైద్యం నిర్వీర్యం

కాంగ్రెస్ పాలనలో అధ్వానంగా ప్రభుత్వ దవాఖానలు: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేట పట్టణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 25: కాంగ్రెస్ పాలనలో సర్కార్ వైద్యం నిర్వీర్యమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 104 మందికి రూ. 25 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఇప్పటివరకు 9,800 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించామన్నారు. కాంగ్రెస్ పాలనలో నేను పోను బిడ్డో సర్కారు దవాఖానకు అనే మాట ప్రజల్లో మళ్లీ మొదలైందన్నారు. ఈ పరిస్థితి ప్రభుత్వ దవాఖానల్లో తెలంగాణ రాకముందు ఉండేదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేవని, కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు ఇవ్వడం బంద్ చేశారన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్యాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేస్తే దానిని రద్దు చేసి హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారన్నారు. సిద్దిపేట ప్రజల ప్రాణాలను కాపాడాలని నేను మంజూరూ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సిద్దిపేట ప్రజల ఆరోగ్యం కోసం వెయ్యి పడకల దవాఖానను మంజూరు చేస్తే ప్రభుత్వం అర్థంతరంగా పనులను అపివేసిందన్నారు. క్యాన్సర్ కిమొథెరపీ, రేడీయోథెరపీని కూడా రద్దు చేశారన్నారు. జిల్లాలో రూ.200 కోట్ల రోడ్డు పనులు రద్దు చేసి మంత్రి సీతక్క ములుగుకు తరలించుకపోతున్నరని తెలిపారు. సిద్దిపేటకు మంజూరైయిన నిధులను రద్దు చేస్తున్నారని, వెటర్నరీ కళాశాలను రద్దు చేశారని విమర్శించారు. సిద్దిపేటను జిల్లా చేసి గోదావరి జలాలు, రైలు, సుడాను ఏర్పాటు చేసి అగ్రగామిగా నిలిపామన్నారు. సిద్దిపేటలో గోదావరి జలాలతో కరువు అనేది లేకుండా చేశామని, అన్ని రంగాల్లో సిద్దిపేట అభివృద్ధి చెందిందన్నారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఏ మొహం పెట్టుకొని ఇక్కడ తిరుగుతారన్నారు. సిద్దిపేట కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా...సిద్దిపేట అభివృద్ధికి మోకాళ్లు అడ్డుపెట్టడం కాంగ్రెస్ నైజామా అని ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉండి మన అభివృద్ధిని చూసి, కండ్లలో నిప్పులు పోసుకున్నారు.. నేడు నిధులు ఇవ్వకుండా మొకాలు అడ్డు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులకు డబుల్ పనులు చేసి, ప్రేమ పొందాలన్నారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటే రద్దు చేసిన పనులు ఇవ్వకుంటే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అసెంబ్లీ లో కొట్లాడుతా..అవసరం అయితే కోర్టుకు వెళ్తానన్నారు. సిద్దిపేట అభివృద్ధి కోసం, ప్రజల కోసం ఏ పోరాటానికైనా సిద్ధమేనన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగింటి కనుకరాజులతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం

- పరిశీలించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఘటనపై పూర్తిస్థాయి విచారణకు కలెక్టర్ ఆదేశం
- అన్ని కార్యాలయాల్లోనూ ఫైర్ సేఫ్టీ తనిఖీ చేయాలని ఆదేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 25: కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) కార్యాలయంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖలను కలెక్టర్ ఆదేశించారు. అగ్ని ప్రమాద ఘటనలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, అవరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాద ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి ప్రమాదం వెనుక ఉన్న కారణాలను కచ్చితంగా నిర్ధారించాలని అగ్ని మాపక శాఖ అధికారులను ఆదేశించారు. సీపీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో కలెక్టరేట్‌లో ఆందోళనకర పరిస్థితి నెలకొన్నది. దీంతో కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల భద్రతాప్రమాణాలను పున:సమీక్షించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

షార్ట్ సర్క్యూట్ కారణమా..?

కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి అగ్ని ప్రమాదం జరిగిన కార్యాలయాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధిత శాఖ అధికారులు స్పందిస్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు వివరించారు. ప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి మృతి

- రాంచంద్రారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన హరీశ్‌రావు

రాంచంద్రారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 25: కేసీఆర్ మిత్రుడు, దొమ్మాట మాజీ ఎమ్మెల్యే దొమ్మాట రాంచంద్రారెడ్డి(85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు దవాఖానలో మృతిచెందారు. ఆయన స్వగ్రామం సిద్దిపేట జిల్లా కొండపాక. ఆయనకు భార్య అనంతలక్ష్మిలో పాటు ఇద్దరు కూతుళ్లు సీత, గీత ఉన్నారు.

కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు..

నేవిలో ఉద్యోగం చేసిన రాంచంద్రారెడ్డి టీడీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1985లో కేసీఆర్ సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు దొమ్మాట నుంచి రాంచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది రెండు నియోజకవర్గాల్లో టీడీపీని బలోపేతం చేశారు. నాలుగున్నరేండ్లు తెలుగుదేశం ఎమ్మెల్యేగా పనిచేసిన రాంచంద్రారెడ్డి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ప్రభుత్వంలో అల్లుళ్ల పెత్తనం చెలాయించడంతో ఎన్టీఆర్‌ను విభేదించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాడు.

రామచంద్రారెడ్డిని మరువని కేసీఆర్...

ఎన్టీఆర్‌తో విభేదించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రాంచంద్రారెడ్డికి ఎమ్మెల్యే కోటాలో కనీసం ఇంటి స్థలం కూడా దక్కలేదని మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండోసారి ఉన్న కేసీఆర్ రాంచంద్రారెడ్డికి ఫోన్ చేసి అన్న ఈ తమ్ముడు ఉన్నాడని మరువకు, నీకు ఏ అవసరం వచ్చినా ఫోన్ చేయాలని కోరారు. కొండపాకలో గొర్రెల పంపిణీ కార్యక్రమానికి హాజరైన కేసీఆర్ రాంచంద్రారెడ్డి పరిస్థితిని గుర్తుపెట్టుకొని ఆయనకు సిద్దిపేటలో ఇంటి స్థలం ఇవ్వాలని నాటి సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని ఆదేశించారు. కేసీఆర్ వెళ్తుండగా రాంచంద్రారెడ్డి తన కూతుళ్లతో కేసీఆర్‌ను కలిసేందుకు రావడంతో వారిని ఆప్యాయంగా పలకరించడంతో పాటు భోజనం చేస్తూ మాట్లాడుకుందాం అంటూ వారిని ఆయన వెంట తీసుకువెళ్లారు.

రాంచంద్రారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన హరీశ్‌రావు

అనారోగ్యంతో మృతి చెందిన దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి పార్థివదేహానికి కొండపాక మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాంచంద్రారెడ్డి కేసీఆర్‌కు ఎంతో ఆత్మీయుడు అన్నారు. ఆయన ఎప్పుడు ప్రజాసేవ, అభివృద్ధిపైనే తపన పడ్డారని కొనియాడారు. దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి కోరిక మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొండపాక అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. రాంచంద్రారెడ్డి దవాఖాన వైద్య ఖర్చులకు కేసీఆర్ ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించడంతో పాటు సిద్దిపేటలో ఇంటి స్థలాన్ని ఇచ్చి గౌరవించుకున్నామని చెప్పారు. వారి మృతి బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, కొండపాక మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ ర్యాగల దుర్గయ్య, అంబటి బాలచందర్‌గౌడ్, చిక్కుడు భానుతదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

హుస్నాబాద్, నవంబర్ 25: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన విజయోత్సవ సభలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగమూర్తి, శివయ్య, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చేనేత బోర్డుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

- తెలంగాణలో దుర్భర జీవితం గడుపుతున్న చేనేత కార్మికులు
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్

చేనేత కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసిన నాయకులు

చేర్యాల, నవంబర్ 25: కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా చేనేత పరిశ్రమను, చేనేత సహకార సంఘాలను కార్పొరేటీకరణ పేరుతో భ్రష్టు పట్టించిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ అన్నారు. చేనేత కార్మికుల స్థితిగతులు, వారు పడుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసేందుకు సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో చేనేత కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ..నేతన్నలు దుర్భర జీవితాలు గడుపుతూ, ఆకలికేకలతో ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి తెలంగాణలో దాపురించిందన్నారు. దీనిని ఎదురించడం కోసం చేనేత కార్మికులు సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం చేనేత పరిశ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు సిద్ధంకావడంతో చేనేత కార్మిక సంఘాలు పూర్తిగా దివాలా తీశాయన్నారు. మగ్గాల పై వస్త్రాలు నేస్తున్న కార్మికులకు నూలు అందించే విషయంలో జాప్యం జరుగుతుండడంతో పొద్దంతా పని చేసినా గిట్టుబాటు కావడం లేదన్నారు. సంప్రదాయంగా వస్తున్న చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి కోసం బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు రూ.1000కోట్లు కేటాయించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నూలు, రంగుల సబ్సిడీ పథకం, నగదు బదిలీని కొనసాగించాలని, చేనేత కార్మికుల హౌస్ కం వర్క్ షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి సమస్యలు పరిష్కరించాలని, సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిసెంబర్ 10 హైదరాబాద్‌లో నిర్వహించే చేనేత ఆత్మీయ కలయిక కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బడుగు శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి ముప్పం నరహరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో, పాము బాలనర్సయ్య, వెంకటేశం, చక్రపాణి, రామచంద్రం, యాదగిరి, బాలు, నర్సింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెదక్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలను పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై కలెక్టర్‌కు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించడంలో వివిధ శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తూ... సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. ప్రతివారం వచ్చే వినతులను ఎప్పటికప్పుడు ఆయా దరఖాస్తులను ప్రాధాన్యతాక్రమంలో పరిశీలించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు స్వీకరించామని, అందులో ధరణి-16, పెన్షన్ -3, ఉపాధి-2, ఇతర సమస్యలు-13 వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై ప్రజల్లో పెరిగిన విశ్వాసం

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 25: ప్రజావాణి సమస్యలను అధికారులు ప్రత్యేక చొరవ చూపి సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వ్యయప్రయాసలకోర్చి వస్తారని, అధికారులు శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లకు సంబంధించి 62 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 60 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 25: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాధులను అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో 60 అర్జీలు అందాయి. చౌటకూర్ గ్రామస్తులు అర్జీని అందజేస్తూ కొత్తగా ఏర్పడిన మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పద్మజారాణి, పరమేశ్, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సంగారెడ్డి జిల్లా కంది జైలు ఎదుట మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

అమాయకులను జైలులో పెట్టారు

- లగచర్ల బాధితులను విడుదల చేయాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులకు పరామర్శ

కంది, నవంబర్ 25: లగచర్ల ఘటనలో అమాయకులను జైలులో పెట్టారని, కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి గ్రౌండ్ లెవల్ రిపోర్టు ఇస్తామని చెప్పారు. లగచర్ల, రొటిబండ తండాలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పర్యటించిందని, ఇప్పటికీ గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైలులో పెట్టడం బాధాకరమన్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారని, అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి దాడులు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్సీ యాక్టుకు విరుద్ధమన్నారు. అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమమంలో దళిత సంఘాల నాయకులు జగన్, దుర్గాప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

నాడు నాటారు.. నేడు నరికారు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాడు హరితహారం పేరుతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా భారీఎత్తున మొక్కలు నాటారు. అవి ఇప్పుడు వృక్షాలుగా మారి ప్రజలకు నీడనిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నేడు ఆ చెట్లను నరికి వేయిస్తుండడంతో రాజీవ్ రహదారి వెలవెలబోతుంది. ఇది సాక్షాత్తు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం విడ్డూ